ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 22 మే 2024 | 5

శిథిలావస్థలో కళింగల్స్, స్లూయిజులు
పూడుకుపోయిన కాలువలు..
పేరుకుపోయిన గుర్రపుడెక్క
పూడ్చని గండ్లు
అత్యవసర పనులకు రెండున్నరేళ్ల క్రితం
నిధులు మంజూరు చేసినా పనులు
ముందుకు కదలని పరిస్థితి
ఇలాగైతే సార్వాకు సాగునీటి సరఫరా ఎలా?

క్లోజర్ పనులు లేనట్టేనా?



పేరుకుపోయిన గుర్రపుడెక్క



పట్టణ శివారు ఇలింద్రాడ వద్ద పంటకాలువ పరిస్థితి ఇది


ఏలేరు ప్రధాన కాలువలో పలుచోట్ల గుర్రపుడెక్క, పూడిక పెరిగిపోయి ఉంది. ఏలేరు, పీబీసీ పరిధిలో సాగునీటిని మళ్లించుకునేందుకు రైతులు చెట్టుకొమ్మలు, ఇసుక బస్తాలతో తాత్కాలిక అడ్డుకట్టలు వేసిన దృశ్యాలు పలుచోట్ల కనిపించాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల సమీపంలో ఉన్న ఏలేరు కాలువలతో పాటు రావర్తి, భోగాపురం, నరసింగపురం, విరవాడ, గోకివాడ, విరవ, మంగితుర్తి, బిప్పర్తిపాడు, రాయవరం, పి.తిమ్మాపురం, పి.దొంతమూరు తదితర ప్రాంతాల్లో పూడిక పేరుకుపోవడంతో సాగునీటిని పొలాలకు మళ్లించుకోవడంలో రైతులు గత ఆయిదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల కాలువలు కనిపించనంతగా గుర్రపుడెక్క, పూడికలు పేరుకుపోయాయి. ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులే సొంతంగా పనులు నిర్వహించుకున్నారు. పీబీసీ ప్రధాన కాలువతో పాటు పంట కాలువల్లోనూ గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీనితో ఇక్కడ శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరందని పరిస్థితి ఉంది.

రైతులకు సక్రమంగా సాగునీరు అందాలంటే నిర్వహించాల్సిన క్లోజర్ పనులు ఈ ఏడాది లేనట్టేనా. పరిస్థితి చూస్తుంటే అవుననే అనిపిస్తున్నది. సమయం ముంచుకొస్తున్నా ఇరిగేషన్ శాఖలో కనీసం కదలిక లేదు. ఎక్కడికక్కడ శిథిలమైన స్లూయిజులు, కళింగల్స్, పూడుకుపోయిన కాలువలు, పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడ్చని గండ్లు ఇదీ పంట కాలువల దుస్థితి. అత్యవసరమంటూ రెండున్నర సంవత్సరాల క్రితం మంజూరు చేసిన పనులు నేటికీ ప్రారంభం కాని స్థితి. ఇలాగయితే సార్వాలో సాగునీరు అందడం గగనమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పిఠాపురం/గొల్లప్రోలు, మే 21:

ప్రతీ ఏటా సార్వా, దాళ్వా సాగు అనంతరం కాలువలకు నీటి విడుదలను నిలిపివేసి మరలా జూన్ నెలలో సార్వా సాగు సమయానికి మరలా విడుదల చేస్తారు. ఏలేరు, పీబీసీ కాలువల పరిధిలో ఈ రెండింటి మధ్య వ్యవధి 45 నుంచి 60 రోజుల వరకూ ఉంటుంది. కాలువల మూసివేతకు, నీటి విడుదల ప్రారంభానికి మధ్య ఉన్న సమయంలోనే కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటు అవసరమైన మరమ్మతులు నిర్వహించాలి. శిథిలమైన కళింగల్, స్లూయిజులు ఇతర కట్టడాలకు మరమ్మతులు, కొత్త గేట్లు, బల్లలు ఏర్పాటు చేస్తారు. క్లోజర్ పనులుగా వ్యవహరించే ఈ పనులు నిమిత్తం ఏటా అధిక మొత్తంలో నిధులు విడుదల అయ్యేవి. వైసీపీ పాలనలో అంతా రివర్స్‌గా ఉంది. గత నాలుగేళ్లుగా క్లోజర్ పనులకు నిధులు విడుదల లేకపోవడంతో తీవ్ర తాత్సారం చేయడంతో పాటు అరకొరగానే నిధులు విడుదల విడ్డూరం పరిపాటిగా మారింది. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో అసలు క్లోజర్‌కు పనులే ప్రతిపాదించలేదని సమాచారం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కొత్తగా నిధుల విడుదల చేసే అవకాశం లేదని, అందుబాటులో ఉన్న పాత నిధులతోనే పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించినట్టు చెబుతున్నారు. అసలు టీస్ట్ ఏమిటంటే ఇరిగేషన్ శాఖ వద్ద ఎటువంటి నిధులు అందుబాటులో లేవు. ఇప్పటికే చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

కళింగల్స్‌దీ అదే స్థితి



మల్లవరంలోని ఆర్అండ్‌బీ చెరువు ప్రధాన కళింగల్ దుస్థితి

ఏలేరు, పీబీసీ కాలువలకు సంబంధించి పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల కళింగల్స్ రెగ్యులేటర్లు, స్లూయిజులు శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల కానుల సైతం దెబ్బతిన్నాయి. గేట్లు విరిగిపోయాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట కాలువలు కోతకు గురయ్యాయి. గట్లు బలహీనంగా మారాయి. పలు చోట్ల కాలువలకు పడిన గండ్లను తాత్కాలికంగా పూడ్చి వదిలివేశారు. గొల్లప్రోలు-పిఠాపురం మధ్య గల పిడింఠొడ్డి రెగ్యులేటర్ వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది. ఇక్కడ ఉన్న కాంక్రీటు కానులు వరదలకు కొట్టుకుపోయాయి. దీంతో ఆయిదేళ్లుగా రైతులు సిమెంటు బస్తాలతో రింగ్‌బండ్‌లు వేసుకుని, తాత్కాలికంగా బల్లలు ఏర్పాటు చేసుకుని సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా చూసుకుంటున్నారు.

ఇలాగైతే ఎలా..

గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే మల్లవరం ఆర్అండ్‌బీ చెరువులో ప్రధాన కళింగల్ గేట్లు శిథిలమవ్వడంతో పాటు కట్టడాలు కూలిపోయాయి. పలు స్లూయిజులు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు నిర్వహించేందుకు నాలుగున్నరేళ్ల క్రితం నిధులు మంజూరయినా నేటికీ పనులు జరగలేదు. సాక్షాత్తు జిల్లా కలెక్టరు స్వయంగా పరిశీలించి ఏలేరు కాలువపై గొల్లప్రోలు బల్లకట్టు కొట్టుకుపోయిన ప్రాంతంలో శాశ్వత కట్టడం నిర్మాణం నిమిత్తం రూ.44 లక్షలు మంజూరు చేసి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా పనులు ముందుకు సాగలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో క్లోజర్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. అయితే బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంతో కాంట్రాక్టర్లు క్లోజర్ పనులు అంటేనే ముఖం చాటేస్తున్నారు.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల పిడింఠొడ్డి రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరిన దృశ్యం

జిల్లా కలెక్టరు మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టేందుకు ఏ కాంట్రాక్టరు ముందుకు రాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.



గండి పూడ్చివేత, కాంక్రీటు గోడ నిర్మాణానికి జిల్లా కలెక్టరు రూ.44 లక్షలు మంజూరు చేసి రెండున్నర సంవత్సరాలు గడిచినా పనులు ప్రారంభం కాని ఏలేరు కాలువపై గొల్లప్రోలు వద్ద గల బల్లకట్టు

సమయం వచ్చేసింది..

కాలువలకు సాగునీటి విడుదల సమయం దగ్గర పడుతున్నది. రెండు సంవత్సరాలుగా కాలువలకు ముందస్తుగానే సాగునీరు విడుదల చేస్తున్నారు. జూన్ 1వ తేదీనే గోదావరి కాలువలకు, 10వ తేదీన ఏలేరు, పంపా కాలువలకు సాగునీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. ఈలోగా క్లోజర్ పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా విడుదల కాలేదు. గత సార్వా, దాళ్వా సమయంలో పొలాలకు సక్రమంగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు పరిస్థితి అంత కంటే దారుణంగా ఉంది. కనీసం అత్యవసర పనుల నిర్వహణ నిమిత్తం నిధులు విడుదల చేయకపోతే వచ్చే సార్వా సీజన్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని ఇరిగేషన్ అధికారులే చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఎన్నికల కోడ్ వంకతో తన బాధ్యత నుంచి తప్పుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు సాగునీరు సక్రమంగా అందుతుందా లేదా అని సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

కోడ్ ఉల్లంఘనపై కలెక్టర్ సీరియస్

చైర్‌పర్సన్ చాంబర్‌కు తాళాలు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై వేటు

గొల్లప్రోలు, మే 21: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై జిల్లా కలెక్టరు సీరియస్ అయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా, కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ కార్యకర్త విశ్వనాథుల దీప(బిందు) పుట్టిన రోజు వేడుకలను చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలరు గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన విషయంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమయింది. దీనిపై జిల్లా కలెక్టరు అధికారుల వివరణ కోరారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనంపై స్వయంగా హాజరై, తీసుకున్న చర్యలతో వివరణ ఇవ్వాలని నగరపంచాయతీ కమిషనర్ రవికుమార్‌ను జిల్లా జాయింట్ కలెక్టరు, పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనపై కమిషనరు వివరణ ఇస్తూ తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తిన నేపథ్యంలో వాటి పరిష్కార నిమిత్తం తాను వెళ్లిన సమయంలో తనకు ఎంసీసీ టీమ్ ద్వారా బర్త్‌డే వేడుకలపై సమాచారం వచ్చిందన్నారు. దీనితో వెంటనే వారందరిని ఖాళీ చేయించాలని ఆదేశించినట్టు కమిషనరు తెలిపారు. ఈ సంఘటన తర్వాత చైర్‌పర్సన్ చాంబర్‌కు తాళాలు వేశారు. మరోవైపు చైర్‌పర్సన్ చాంబర్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలర్ గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి, కౌన్సిలర్ గంటా అప్పలస్వామి, కౌన్సిలర్ భర్తలు దానం లోవబాబు(పుడులు), వడిసెల సత్తిబాబు, మైనం నూకాజీ, గొల్లప్రోలు సొసైటీ చైర్మన్ శ్రోత్రుల భీముడులపై చర్యలు తీసుకోవాలని కమిషనరు మంగళవారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏడుగురిపై పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. మరోవైపు అనుమతి లేకుండా చైర్‌పర్సన్ చాంబర్ తెరిచిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని తాత్కాలికంగా విధులు నుంచి తప్పిస్తూ కమిషనరు రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 21: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మంగళవారం కాకినాడ జేఎన్‌టీయూలోని సివిల్ డిపార్ట్‌మెంట్ పీజీ బ్లాక్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు ఇతర పోలింగ్ సామగ్రిని జేఎన్‌టీయూలో నియోజకవర్గాల వారీగా ఆయా బ్లాకుల్లో సురక్షితంగా భద్రపరిచినట్టు చెప్పారు. అలాగే కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లను జేఎన్‌టీయూలోని సివిల్ డిపార్ట్‌మెంట్ పీజీ బ్లాక్‌లోను, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని ప్రశాంత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలపై కలెక్టర్ సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), మే 21: ఈనెల 24 తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టు హాలులో ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై మంగళవారం కలెక్టర్ జె.నివాస్ అధ్యక్షతన కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 7,915 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతిస్తారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్షా కేంద్రాలకు రాకూడదన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎటువంటి అక్రమాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులతో 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లోని జెరాక్స్ సెంటర్లన్నింటిని పరీక్షా సమయంలో మూసివేయించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీరు, ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచాలని మున్సిపల్ కమిషనర్లు, డీఎంహెచ్‌ఓలకు సూచించారు. అలాగే పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను కోరారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరేందుకు వీలుగా ఆయా రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈనెల 24వ తేదీ నుంచి 31 తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరుగనున్నాయన్నారు. మొత్తం 22,393 మంది విద్యార్థుల కోసం జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, డీఈఓ రమేష్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నూకరాజు, ఓపెన్ స్కూల్ డీసీ సాయివెంకటరామ్, కాకినాడ నగర ఏడీసీ నాగనరసింహారావు, డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్, ఆర్డీఎస్ఏ ఎస్ఈ శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలను అధిగమించాలి

కలెక్టరేట్(కాకినాడ), మే 21: జాతీయ ఉపాధి హామీ పనుల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జె.నివాస్ వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, పనిదినాలు, తాగునీటి సరఫరా, వేసవిలో విద్యుత్ సరఫరా, లాఅండ్‌ఆర్డర్, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో సీఎస్ జవహర్‌రెడ్డి ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ పని దినాలు సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలన్నారు. అలాగే వేసవి దృష్ట్యా విద్యుత్ సమస్యలు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో తిప్పేనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వృద్ధుడి మృతి

జీజీహెచ్‌లో బంధువుల ఆందోళన

కాకినాడ క్రైం, మే 21 : కాకినాడ జీజీహెచ్‌లో కొంత మంది వైద్యుల నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడి మృతి చెందడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నకాలంలో వైద్య సేవలు అందించకుండా శ్వాస ఆడటం లేదని వేడుకున్నా కనికరించకుండా అలసత్వం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని, సరైన చికిత్స చేయకుండా మృతదేహానికి సెలైన్ పెట్టారనే ఆరోపణలతో కుటుంబ సభ్యులు మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో ఆందోళన చేపట్టారు. వివరాల్లోకెళితే యానాం గిరియాంపేట మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మేడా లోకేష్ (60) సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత దగ్గు వచ్చి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించడంతో కుటుంబసభ్యులు ఆదేరోజు రాత్రి 2 గంటలకు జీజీహెచ్‌లో చేర్పించారు. నాన్ ఎమర్జేన్సీ వార్డులో చేర్చి ఆక్సిజన్ పెట్టిన కాసేపటికే లోకేష్ కోలుకున్నారు. వృద్ధాప్యం కావడంతో ఆనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయేమోనని కారణంతో సీనియర్ వైద్యులు సూచన మేరకు జూనియర్ వైద్యులు వార్డుకి తరలించారు. ఆ తర్వాత కాసేపటికి శ్వాస ఆడటం లేదని వైద్యులకు చెప్పడంతో ఇంజక్షన్లు చేశారు. ఇంజక్షన్లు ఇచ్చిన కొద్దిసేపటికే కదువు బాగా ఉబ్బిపోయి శ్వాస ఆడటం లేదని చెప్పడంతో కుమారుడు రాజు వైద్యులకు ఈ విషయం చెప్పాడు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఊపిరి ఆడటం లేదంటూ కేకలు వేసి కుప్పకూలిపోయాడని కుమారుడు రాజు తెలిపారు. అనంతరం వైద్యులు వచ్చి వృద్ధుడి గుండె, పొట్టపై నొక్కి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేసి, ఆక్సిజన్ పెట్టారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వార్డు నుంచి డాక్టర్లు సీఎంఓకూ తరలించారు. అక్కడ సెలైన్ బాటిల్ ఎక్కించారు. అప్పటికే తండ్రి లోకేష్ మృతి చెందడంతో పొట్టబెట్టిపోయిందన్నారు. ఆయినా డాక్టర్లు సెలైన్ బాటిల్ పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన తర్వాత డాక్టర్లు సెలైన్ బాటిల్ ఎక్కించారని ఆరోపించారు. వైద్యుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి ఆవరణలో బార్య రామయమ్మ, కుమారుడు రాజులతో బంధువులు ఆందోళన చేపట్టారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు అందించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు ఇక లేరు



- అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి
- దొమ్మేరు జమిందార్‌గా సుపరిచితం
- ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి..
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం
- నాడు ఉమ్మడి పశ్చిమను శాసించిన నాయకుడు
- భార్య మరణంతో ఇంటికే పరిమితం

కొవ్వూరు, మే 21 : ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)ఇక లేరు. ఆయన వయసు 71 ఏళ్లు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య నాగమణి కొన్నేళ్ల క్రితమే మరణించారు. అప్పటినుంచి ఇంటికే పరిమితమయ్యారు.

కృష్ణబాబు ప్రస్థానం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పిలుపుతో కృష్ణబాబు 1982లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983, 1985, 1989, 1994, 2004 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో మాత్రం ఓటమి పాలయ్యారు. సుమారు 23 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరు పొందారు. నిజాయితీతో, నిస్వార్థంగా ప్రజాసేవ చేయడం వల్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగారు. కొవ్వూరుతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఉమ్మడి పశ్చిమలో అన్ని నియోజకవర్గాల్లోను అభిమానులను, అనుచరగణాన్ని కలిగి ఉన్నారు. నాలుగు దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించారు. మెట్ట ప్రాంతంలోని నాయకులు, కార్యకర్తలు ఆయన మాట జవదాటేవారు కాదు. జిల్లా పరిషత్, జిల్లా సహకార కేంద్రబ్యాంక్ చైర్మన్ల ఎంపికలోనూ కీలకపాత్ర పోషించేవారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. 2012 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ కేంద్రపాలక మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు. ది ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణరంగారావు, అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడో సంతానంగా 1953 మే 31న జన్మించారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు సోదరి కుమారుడు. బోళ్ల బుల్లిరామయ్యకు బావమరిది. ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లకు సోదరుడు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎం.డి విభాస్ పాలిమర్స్), కుమార్తె అర్చన ఉన్నారు. కుమారులు పారిశ్రా మికవేత్తలు కాగా, కుమార్తె గృహిణి, అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ప్రస్తు త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్నారు.

నేడు అంత్యక్రియలు

కృష్ణబాబు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కొవ్వూరు మండలం దొమ్మేరులోని వారి నివాసానికి తీసుకువస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దొమ్మేరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో కృష్ణబాబు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కృష్ణబాబు



2023లో పుట్టినరోజు వేడుకలలో కేక్ కట్ చేస్తున్న కృష్ణబాబు



టీడీపీ నాయకులతో కృష్ణబాబు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌తో బాబు

కృష్ణబాబు మరణం తీరనిలోటు

కృష్ణబాబు మరణం జిల్లావాసులకు తీరని లోటని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. 'ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆయన వెంటనే స్పందించేవారు. ఆయన హయాంలోనే నియోజకవర్గంలో పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసి, రైతులకు సాగునీరందించారు. 2003 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాన్ని అభివృద్ధి చేశారు. అచ్చాయమ్మ కాలనీలో పేదలకు ఇళ్లస్థలాలు అందించారు' అని కొనియాడారు. కృష్ణబాబు మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలంతా సంతాప దినంగా పాటించాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో కొవ్వూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఇమ్మణ్ణి వీర శంకరం, పేరిచర్ల బోసురాజు, కేవీకే రంగారావు, పెనుమాక జయరాజు, పిక్కి నాగేంద్ర సంతాపం తెలిపారు.

కృష్ణబాబు మృతికి హోం మంత్రి సంతాపం

దేవరపల్లి, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు మృతి పట్ల హోం మంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యర్నగూడెం క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కృష్ణబాబు ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణబాబు మరణం వ్యక్తిగతంగా తనకు, తమ పార్టీ తీరని లోటన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావుతో కృష్ణబాబుకు ఉన్న సాన్నిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారన్నారు. అలాగే చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాట్రగడ్డ శ్రీనివాస్‌చౌదరి.. కృష్ణబాబు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి మెట్ట ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు.

కృష్ణబాబు మృతికి చంద్రబాబు సంతాపం

కొవ్వూరు, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి పట్ల టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు విశేష సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఏపీ ఈఏపీసెట్‌కు రెండు సెషన్లలో 1478 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 21: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మంగళవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 597 మంది విద్యార్థు హాజరు కావాల్సి ఉండగా 581 మంది హాజరయ్యారని, 16 మంది గైర్హాజరు కాగా, 97.32 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరు కాగా 97.50 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 1,517 మంది హాజరుకావాల్సి ఉండగా 1,478 మంది హాజరయ్యారని 39 మంది పరీక్ష రాయలేదని 97.43 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1,422 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1395 మంది హాజరుకాగా మొత్తం 98.10 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో మంగళవారం నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690మంది హాజరు కావాల్సి ఉండగా 672 మంది హాజరుకాగా మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఈనెల 23 వరకూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశపరీక్షలు కొనసాగుతాయన్నారు.

అడ్డతీగలలో పెట్రోల్ రూ.200

అడ్డతీగల, మే 21: అడ్డతీగల గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో గత మూడు రోజుల నుంచి పెట్రోల్ నిల్వలు లేక మండలం లోతట్టు గ్రామాల సైతం ఒక లీటర్ పెట్రోల్ రూ.180 నుంచి రెండు వందల రూపాయల వరకు అమ్మడంతో వాహనదారులు అల్లాడిపోతున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పెట్రోల్ బంక్‌లలో తప్ప ప్రైవేటుగా పెట్రోల్ అమ్మకాలను నిషేధించారు. అడ్డతీగల బంక్‌లో పెట్రోల్ లేకపోవడంతో పెట్రోల్‌ను మైదాన ప్రాంతం నుంచి రవాణా చేస్తున్నారు.

వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి

- ఘనంగా పండిత సదస్యం
- సుమారు 100 మంది పండితులకు సత్కారం



పండిత సదస్యం కార్యక్రమానికి హాజరైన పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి మంగళవారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాలలో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామివారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం పండిత సదస్యం అత్యంత ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించి మరో వేదికపై క్షేత్రపాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పండితులంతా తమ పాండిత్యంతో మైమరిపింపచేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 100మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, విసినకర్రను అందజేసి నగదు పురస్కారాలను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు అందజేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతుకు వేదాశీర్వచనాలు అందజేశారు.

పొన్నవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు



పొన్నవాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. చైర్మన్ రోహిత్ టెంకాయికొట్టి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

సత్యదేవుడి చక్రస్నానం కోసం ఏర్పాట్లు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో ముఖ్య ఘట్టాలలో ఒక్కటైన చక్రస్నానం నిర్వహణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం లేకపోవడం, పుష్కరజలాల కోసం ప్రయత్నించిన అది సాధ్యపడకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటిని ఎక్స్‌కవేటర్‌తో చిన్నకొలను ఏర్పాటుచేసి నీటిని కొలనులోకి ప్రత్యేకమార్గం ద్వారా నీటితో నింపుతున్నారు.

నిరాధార వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ



కాకినాడ క్రైం, మే 21 : ఎన్నికల లెక్కింపు రోజు, తర్వాత కాకినాడసిటీ, పిఠాపురం నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న సందేశాల్లో ఏమాత్రం నిజంలేదని, తప్పుడు వదంతులు వ్యాప్తిచేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గత రెండురోజులుగా వివిధ సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాల్లో కౌంటింగ్ రోజున, కౌంటింగ్ తర్వాత కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గం పరిధిలో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ నిఘా విభాగం నుంచి ఎన్నికల కమిషన్‌కు నివేదికలు వెళ్లాయని వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదన్నారు. కాకినాడ జిల్లాలో గత నాలుగు నెలలుగా కేంద్ర పారా మిలటరీ బలగాల సమన్వయంతో పోలీసులు పూర్తిస్థాయిలో గస్తీ నిర్వహించారని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులు కృషి చేశారన్నారు. నేర ప్రవృత్తి గలవారిని, సమస్యలు సృష్టించే వారిని మండల రెవెన్యూ అధికారి, మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల సంఘం, ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో శాంతి భద్రతలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

నిబంధనలు అనుసరించి బ్రిడ్జిని పూర్తిచేయాలి

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఏఐఐబీ బృందం



గంటిపెదపూడిలో వంతెన పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ బృందం

పి.గన్నవరం, మే 21: నిబంధనలు అనుసరించి నిర్దీత సమయంలో బ్రిడ్జిని పూర్తిచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఏసియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) బృందం సూచించింది. గంటిపెద పూడిలో లంక గ్రామాల ప్రజలు రాకపోకల కోసం నదీపాయపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను ఏఐఐబీ బృందం పరిశీలించి అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఐబీ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టుల్లో ఈప్రాజెక్టు పనులు నిబంధనలు ప్రకారం జరుగుతున్నాయని కితాబుచ్చారు. అంతేకాకుండా నిబంధనల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌ను మహిళ ఆపరేటింగ్ చెయ్యడంపై హర్ష వ్యక్తంచేసి సంబంధిత ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన పనుల్లో భాగంగా మూడు బాక్స్ కల్వర్టులు, ఒక అబట్ మీట్, నాలుగు పిల్లర్లు, 250 మీటర్ల అప్రోచ్‌రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అనంత రం ఇప్పటివరకు జరిగిన కాల్వపై వంతెన, హైలెవిల్ బ్రిడ్జి పనులకు బిల్లులు మంజూరు చేసే విధంగా సిఫార్సు చేస్తామని చెప్పారు. వంతెన నిర్మాణం నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిశీలనలో సీఈ సీవీ సుబ్బారెడ్డి, ఈఈ రమణమూర్తి (విజయవాడ), ఎస్‌ఈ వి.రవీంద్ర, ఈఈ కె.చంటిబాబు, ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు, ఏఐఐబి బృందం సభ్యులు పరాద్ అహ్మద్, కౌశిక్ రహమాన్(బంగ్లాదేశ్), అశోక్‌కుమార్(ఇండియా), యోగేష్ మల్లా(నేపాల్), లారా(ఫిలిఫిన్), ప్రాజెక్ట్ అడ్వయిజర్ ప్రభాకరరెడ్డి, నరసింహారావు, ఏఈఈ సత్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

పీఏపీఎస్‌లకు కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌పై శిక్షణ

● రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్

కాకినాడరూరల్, మే 21: భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధిలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అర్హత కల్పించుట ద్వారా ఆర్థిక వనరులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొందని రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా రానున్న 3 నెలల్లో శిక్షణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏపీలో 1858, తెలంగాణలో 390 సంఘాల పరిధిలో ఈ శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 288 మంది పీఏసీఎస్‌లలో ఈ శిక్షణ చేపడతామని దీని కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకోవడం జరుగుతుందని శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వంచే గుర్తించిన సాంకేతిక నిపుణులు పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తిగా ఆర్థిక సహకారాన్ని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కల్పిస్తున్నదని, న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ కోఆపరేటివ్ ట్రైనింగ్ సంస్థ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

మునిపల్లిలో వివాహిత మృతి

- ఆత్మహత్యగా కేసు నమోదు
- అల్లుడే హత్య చేశాడని తల్లి ఆరోపణ



నాగారపు లలిత(ఫైల్)

ఉప్పలగుప్తం, మే 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం మునిపల్లిలో సోమవారం రాత్రి ఒక వివాహిత మృతి అనుమానాస్పదంగా మారింది. తన కుమార్తెను అల్లుడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని తల్లి ఆరోపిస్తోంది. మునిపల్లికి చెందిన వివాహిత నాగారపు లలిత (29) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వాడపర్రు ఇందిరా నగర్‌కు చెందిన లలితతో మునిపల్లికి చెందిన భీమేంద్రకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండేవారని... ఈ నేపథ్యంలో భర్త వేధింపులతో లలిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ మహేశ్వర రావు సందర్శించి వివరాలు సేకరించారు. తన కుమార్తెను అల్లుడే హత్యచేశాడని మృతురాలి తల్లి పరమట పుష్పావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అల్లుడికి వివాహేతర సంబంధాలున్నాయని, ఆ కారణంగానే దంపతులిద్దరూ తరచూ గొడవలు పడుతుండేవారని ఫిర్యాదులో పేర్కొంది.

ఉప్పుటేరులో దూకి వివాహిత ఆత్మహత్య



బోరా దుర్గ

కొత్తపల్లి, మే 21: వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన మనస్పర్థల కారణంగా వివాహిత ఉప్పుటేరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమరవల్లిలో మంగళవారం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమరవల్లి గ్రామానికి చెందిన బోరా దుర్గ(38) అనే వివాహిత అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేత సంబంధం కొనసాగిస్తోంది. వివాహేతర సంబంధం కొనసా గిస్తున్న వ్యక్తి అవసరమైనప్పుడు దుర్గ నుంచి చాలా కాలంగా నగదును తీసుకొంటూ వస్తున్నాడు. డబ్బుల విషయంలో ఏర్పడిన మనస్పర్థల కా రణంగా ఇటీవల ఇద్దరు గొడవలు పడ్డారు. ఈనేపథ్యంలో ఆ వ్యక్తి పెట్టే బాధలు భరించలేక ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకొందని పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త రాంబాబు ఫిర్యాదుమేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- బస్సు ప్రమాద ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



చిలకలపూడి సురేష్(ఫైల్)

పి.గన్నవరం, మే 21:ఈనెల 14న అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతా వారిపేటలో జరిగిన ఈప్రమాద ఘటనలో నలుగురు కూలీలు (చిలకపూడి మణిబాబు, నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్, ఈరి కట్టయ్య) అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో యువకుడు చిలకలపూడి సురేష్(35)ను చికిత్స నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించి ఈనెల 17న వైద్యులు సూచన మేరకు కాకినాడ ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత సురేష్ కన్నుమూశాడు. స్థానిక ఎస్‌ఐ బి.శివకృష్ణ పంచనామా కార్యక్రమాలు పూర్తి చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆ....తల్లికి గర్భశోకం మిగిల్చిన ఇద్దరు కుమారులు

ఈప్రమాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న రోదన వర్ణణాతీతం. చేతికి అందివచ్చిన కొడుకులు ఇద్దరు ఒకేసారి కళ్ల ముందు లేకపోవడంతో దేవుడు గర్భశోకాన్ని మిగిల్చారని రోధిస్తుంది. ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంనకు చెందిన చిలకలపూడి వెంకటేశ్వరావు, సత్యనారాయణమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాద ఘటనలో చివరి ఇద్దరు కుమారులు సురేష్, మణిబాబు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామాన్ని సైతం శోకసముద్రంలో ముంచెత్తింది.

పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాస్తారోకో



బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు



పిఠాపురం అగ్రహారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

పిఠాపురం, మే 21: పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల నేతలు రాస్తారోకోకి దిగారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారం పశువుల సంత సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ముఖంపై గుర్తు తెలియని వ్యక్తులు గాట్లు పెట్టారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వీరి ఆందోళనతో ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పిఠాపురం ఇన్‌చార్జి సీఐగా ఉన్న సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పిఠాపురం ఎస్‌ఐ మురళీమోహన్, అదనపు ఎస్‌ఐ వెంకటేష్‌లు అక్కడకు చేరుకున్నారు. ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. ఆందోళనకారులతో మాట్లాడారు. దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ వైఆర్‌కే హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం దళిత సంఘాల నాయకులతో కలిసి సీఐ అంబేడ్కర్ విగ్రహానికి రంగు వేసి పాలాభిషేకం నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవరపల్లిలో 226 రాగి దిమ్మలు స్వాధీనం

- నలుగురి అరెస్టు

దేవరపల్లి, మే 21: దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం 226 రాగి దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేసు వివరాలను వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పెదపూడి గ్రామానికి చెందిన సుంకర సతీష్, కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, నక్కా నాగేంద్రకుమార్, నెల్లూరి లోవరాజు కాకినాడ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుంటారు. సుంకర సతీష్ పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. నాగేంద్ర, దుర్గ, లోవరాజు ఇంటింటికీ వెళ్లి ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వీరు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగిలించేవారు. ఆ రాగివైరును సతీష్‌కు అమ్ముతుంటారు. సతీష్ వ్యాపారాన్ని విస్తరించి కొద్దికాలం కిందట తాడేపల్లిగూడెంలోని డంపింగ్‌యార్డు వద్ద షాపు తెరిచాడు. దొంగిలించిన రాగివైరును అందులోనే కరిగించి దిమ్మలుగా చేసి అమ్మడానికి తరలిస్తుంటారు. 120 వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు పగలగొట్టి కాపర్‌వైరు దొంగిలించారు. 226 రాగి దిమ్మలను ఆరుమూటల్లో పెట్టుకుని వ్యాన్లో అమ్మకానికి విజయవాడ బయలుదేరారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఎస్‌ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. నలుగురిని అరెస్టుచేసి, సుమారు రూ.6లక్షల విలువైన చోరీ సొత్తుతోపాటు మినీవ్యాన్, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, రాజమండ్రి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కే.రజనీకుమార్, ఎస్‌ఐ శ్రీహరిరావు పాల్గొన్నారు.



చోరీ సొత్తుతో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

కాకినాడ

ఎన్నికల కౌంటింగ్‌కు అబ్జర్వర్ల నియామకం

కలెక్టరేట్ (కాకినాడ), మే 21: జిల్లాకు సంబంధించి ఏడుగురు కౌంటింగ్ అబ్జర్వర్లను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులను వెలువరించింది. జగ్గంపేట నియోజకవర్గానికి డాక్టర్ కె.దాక్షాయణి, తునికి సత్‌బీర్ సింగ్, ప్రత్తిపాడుకు రాజేష్ జోగ్‌పాల్, పిఠాపురానికి డాక్టర్ మేజర్ రిటైర్డ్ విశాల్‌శర్మ, కాకినాడ రూరల్‌కు నిధి సరోహి, పెద్దాపురానికి ఆల్‌బెర్ట్ బైలాంగ్, కాకినాడ సిటీ నియోజకవర్గానికి ఎస్.గణేష్‌ను నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతి రౌండ్ ఫలితాలను అబ్జర్వర్లే ప్రకటిస్తారు.

రుణాల వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలి

దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంగల్‌రావు

కాకినాడ సిటీ, మే 21: సెజ్ బాధితుల నిర్వాసిత కాలనీ ఇళ్లపై ఓ ప్రైవేటు బ్యాంకు ఇచ్చిన రుణాల వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని, రుణాల వసూలు పేరుతో బాధిత దళిత కుటుంబాలపై కిరాయి వ్యక్తులతో దందా సాగిస్తున్న ప్రైవేటు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చంగల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై యు.కొత్తపల్లి మండలం కొత్తమూలపేటకు చెందిన కేఎస్ఈజడ్ పునరావాస కాలనీ బాధితులతో చంగల్‌రావు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సంతకాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం చెంగల్‌రావు మీడియాకు సమస్యను వివరించారు. సెజ్ నిర్వాసిత కాలనీలోని బాధిత కుటుంబాలకు రాజమహేంద్రవరానికి చెందిన ది జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ కాకినాడ బ్రాంచ్ తరపున కొందరు వ్యక్తులు కాలనీకి వచ్చి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి వాళ్లకు కావలసిన కాగితాలపై సంతకాలు చేయించుకుని 250 నుంచి 300 మందికి ఒకే బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చారన్నారు. బ్యాంకు మేనేజర్, ఏజెంట్లు కలిసి రుణాలు ఇచ్చేందుకు ఒక్కొక్కరి దగ్గర రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు లంచం తీసుకున్నారన్నారు. కూలి పనులు చేసుకునే నిర్వాసిత కాలనీ బాధితులు బ్యాంక్‌కు కడుతున్న వాయిదాల సొమ్మును వడ్డీ కింద జమ చేసుకున్నారన్నారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాల నుంచి వాయిదాలు చెల్లించలేకపోవడంతో, బ్యాంకు అధికారులు కిరాయి మనుషుల ద్వారా దౌర్జన్యానికి దిగుతూ బాధితులను ఇళ్ల నుంచి బయటకు వెళ్లగొడుతూ తలుపులకు తాళాలు వేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం సెజ్ బాధితుల నిర్వాసిత కాలనీ ఇళ్లపై రుణాలు ఇవ్వరాదని, ఈ రుణాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'అలయన్స్ క్లబ్‌లతో మరిన్ని సేవలు'

కాకినాడ సిటీ, మే 21: అలయన్స్ క్లబ్‌ల ద్వారా వివిధ రూపాల్లో మరిన్ని సేవలు అందిస్తామని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు పేర్కొన్నారు. అలయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికైన శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం సందర్భంగా స్థానిక కాస్మో పొలిటిన్ క్లబ్ హాల్‌లో మంగళవారం క్లబ్ సభ్యుల కుటుంబాల ఆధ్వర్యంలో 'మనమంతా' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సి.బాలచంద్రన్, ప్రత్యేక అతిథిగా పూర్వ అధ్యక్షుడు బి.తిరుపతిరాజు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ బీఎం రావు, రెండో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డీబీజీ శాస్త్రి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ మటూరి శిరీష, సౌత్ మల్టీపుల్ చైర్మన్ ఎస్.రాజేంద్రన్, ఐసీసీ మెంబర్‌షిప్ కో ఆర్డినేటర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు శీర లక్ష్మి, కేవీ సత్యనారాయణ, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.మునిరెడ్డి, పీఆర్‌వో దిలీప్‌కుమార్ సదనాని పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికైన శ్రీనివాసరావును సత్కరించగా, క్లబ్ నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రత్యేక విద్య కోర్సులో అడ్మిషన్లకు దరఖాస్తులు

సర్పవరం జంక్షన్, మే 21: ప్రత్యేక విద్య కోర్సులో అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోర్సు కోఆర్డినేటర్, ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. రిహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్సీఐ) డిప్లమో ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన ఓసీ, బీసీ విద్యార్థులు అర్హులన్నారు. 45 శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, ఫిజికల్ హ్యాండికాప్ విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక విద్య కోర్సు పూర్తయిన అనంతరం డీఎస్సీ, సర్వశిక్షాభియాన్, ఐఈఆర్టీ రీసోర్సింగ్ టీచర్లుగా పనిచేసేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, విద్యార్హత, ఆధార్ జెరాక్స్ కాపీలను కాకినాడ రూరల్ వాకలపూడిలో టీచర్స్ కాలనీగల ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9440119828, 9491220349 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పదోతరగతి విద్యార్థులకు అవగాహన క్లాసులు

కాకినాడ సిటీ, మే 21: పదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ-యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ హోంలో అవగాహన క్లాసులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి జి ప్రభాకరవర్మ క్లాసులు ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.సంజయ్, ఎ.వాసు పర్యవేక్షించారు. రవి చక్రవర్తి మాట్లాడుతూ పదో తరగతి సిలబస్‌లో మార్పులు చేశారని, ఈ క్లాసుల వల్ల విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, తల్లిదండ్రులు విద్యార్థుల్ని ప్రోత్సహించి సద్వినియోగం చేయాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

పిఠాపురం/సామర్లకోట, మే 21: పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మరణించింది. విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉప్పాడ రైల్వేగేటు వద్దకు వచ్చేసరికి 40-45 ఏళ్ల మహిళ ట్రాక్ మీదుగా రావడంతో రైలు ఢీకొని అక్కడిక్కడే మరణించింది. శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయింది. శరీరంపై వంకాయ రంగు మీద తెల్లటి డిజైన్ కలిగిన చీర, ఎరుపు రంగు ఇన్నర్ ఉన్నట్లు సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు తెలిపారు. శరీరం పూర్తిగా నుజ్జునుజ్జవడం వల్ల ఏ ఆనవాళ్లు లభించలేదని, సదరు మహిళ ఆచూకీ తెలిసినవారు సెల్‌నెంబరు 9440627562లో సంప్రదించాలని సూచించారు.

'విద్యార్థులను స్వదేశానికి తీసుకురావాలి'

కొత్తపల్లి, మే 21: కొత్తపల్లికి చెందిన కాకరపల్లి గంగాధరశ్రీనివాసరావు కుమార్తె జ్యోత్స్న కిర్కిస్థాన్‌లో దేశంలోని ఏషియన్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. 2రోజులుగా కుమార్తె నుంచి ఏ సమాచారం రావడంలేదని గమనించిన తల్లిదండ్రులు టీవీ సమాచారం ద్వారా కిర్కిస్థాన్‌లో మెడికల్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై అక్కడ ప్రజలు దాడులు చేస్తున్నారని వార్త చూసి కంగారుపడ్డారు. కుమార్తెకు ఫోన్ చేసి చేయగా అక్కడ హాస్టళ్ల గదిలో ఉన్న విద్యార్థులను తలుపులు కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఏడుస్తూ చెప్పిందని తెలిపారు. కిర్కిస్థాన్‌లో ఉన్న భారత్ విద్యార్థులను స్వదేశానికి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి'

తాళ్లరేవు, మే 21: ఖరీఫ్ పంటసాగు ముందుకు సాగాలంటే రైతుకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను ప్రభుత్వం మెరుగుపరచాలని కౌలురైతు సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు మంగళవారం ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, తుఫానులు, వరదలకు రైతుకు పంటనష్టం జరగకుండా ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచాలన్నారు. వర్షం, వరదలు నీరు నేరుగా డ్రైనేజీలోకి పోయేలా ఉంటే పంటచేలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. ఉపాధిహామీ పథకం రాగానే ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థలు మరుగునపడ్డాయన్నారు.

'ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి'

తాళ్లరేవు, మే 21: ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజువారి వేతనం రూ.600కు పెంచాలని తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనివద్ద కల్పించాల్సిన సదుపాయాలను కల్పించడంలేదని కనీసం కూలీరేటునైనా పెంచాలన్నారు. కూలీలకు ఉపాధిపనికి కావాల్సిన పనిముట్లను ప్రభుత్వం కల్పించాలని, కూలీలకు బీమా సదుపాయం కల్పించాలని కోరారు.

ఉపాధి కూలీల ఆందోళన

గండేపల్లి, మే 21: ఒక్కొక్క ఉపాధి జట్టుకు ఒక్కో రకంగా వేతనాలు ఇస్తున్నారని మండలంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అన్ని జట్టులు ఒక చోట పనిచేసిన ఒక్కో జట్టుకు వేతనాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని.. ఒకరికి రూ.700, మరొకరికి రూ.1300 ఇలా వేర్వేరుగా వేతనాలు ఇవ్వడంపై ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. కొలతలు ప్రకారం పనిచేస్తే వేతనం వస్తుందని, దీనిపై ఉపాధి సిబ్బంది, అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో తెలిపారు.

వినియోగదారుల మండలి అధ్యక్షుడు మృతి

కొత్తపల్లి, మే 21: మండల వినియోగదారుల మండలి అధ్యక్షుడు రావు వెంకట రంగనాయకులు మంగళవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉండి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా కుప్పకూలి మరణించారని కుటుంబసభ్యులు తెలిపారు. రంగనాయకులు మృతి పట్ల జిల్లా వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు పిల్లి తిరుపతిరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మచ్చికంటి వెంకటచలపతిరావు, పడగా నరసింహారావు, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి మానెం సూరిబాబు, కొత్తపల్లి వీవర్స్ సంక్షేమ సంఘ మాజీ అధ్యక్షులు తిప్పన సుబ్బారావు, విజయ జనరల్‌స్టోర్సు సత్యనారాయణ సంతాపం తెలియజేశారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

కాజులూరు, మే 21: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని చేదువాడలో నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పి.రాజబాబు, మునసలయ్య, సత్యనారాయణ, భూచక్రం, హరీష్‌బాబు, అప్పారావు,సత్యనారాయణ ఉన్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు సహకరించాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

జగ్గంపేట, మే 21: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం మధ్యాహ్నం జగ్గంపేటలోని శివపార్వతి ఫంక్షన్ హాల్ నందు జగ్గంపేట నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్క రాజకీయ పార్టీ నాయకులతో ఎంతో చక్కగా సహకరించారన్నారు. అదే సహకారం కౌంటింగ్ నాడు, కౌంటింగ్ తర్వాత సహకారం అందజేయాలని కోరారు. ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడరాదన్నారు. గొడవలకు పాల్పడి అనవసరంగా కేసులలో ఇరుక్కోవద్దన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ ముగిశాక విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే ముందుగా పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిత్ర, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు

ప్రత్తిపాడు, మే 21: జిల్లాలో జూన్4న సార్వత్రిక ఎన్నికలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనంతరం శాంతి భద్రతలకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. ప్రత్తిపాడు సరయు ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో జరిగిన గొడవలు కారణంగా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. జూన్4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీస్ శాఖ తీసుకునే ముందు జాగ్రత్త చర్యలకు అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీస్ శాఖ తీసుకునే విధానాలు వ్యతిరేకించిన వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో మే 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. జూన్4న కౌంటింగ్ సజావుగా శాంతిభద్రతలతో విఘాతం లేకుండా జరిగేలా చూడాలని కోరారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, ట్రైనీ డీఎస్పీ నవజ్యోతి మిత్ర, సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐలు పవన్‌కుమార్, సతీష్, కిషోర్, నబీ, రాజకీయ నాయకులు కొమ్ముల కన్నబాబు, వరుపుల తమ్మయ్యబాబు, వరుపుల సూరిబాబు, ఉమ్మిడి వెంకట్రావు, నీరుకొండ సత్యనారాయణ, దర్నాల కోట శ్రీను,మానుకొండ లచ్చబాబు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

కాకినాడ క్రైం, మే 21: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రిజర్వు ఎస్ఐగా ఎంపికైన శ్రీకాకుళం ఎస్ఎంపురానికి చెందిన వావిలపల్లి భాస్కరరావును అభినందించి ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ భాస్కరరావు 2018 నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. పీసీగా విధులు నిర్వహిస్తూనే తన జీవితాశయమైన ఎస్ఐ పోస్టు సాధించడం గర్వకారణమన్నారు. అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, ఏవో ఎం.శివరామరాజు, ఏఆర్ ఆర్ఐ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీని కోరిన మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 21: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూకేలో ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, కేంద్రబలగాలతో భద్రత కల్పించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించిన సినీహీరో సాయిధర్మతేజ్‌పై తాటిపర్తిలో సీసాతో దాడి జరగడం, పోలింగ్ సమయంలో జరిగిన వివాదాలు, ఆపై కౌంటింగ్, తదనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని వివరించారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ సమయంలో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. పిఠాపురం, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో ఏ అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టాలని, పటిష్టభద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం జేఎన్‌టీయూకేలోని ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రంలో సీసీ కెమెరా విజువల్స్‌ను పరిశీలించారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వర్మ

'వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి'

పిఠాపురం, మే 21: ఓటమి భయంతో ఉన్న వైసీపీ నేతలు కౌంటింగ్ సమయంలో రకరకాల కుట్రలకు తెరలేపే అవకాశం ఉందని, వీటిని తిప్పికొట్టాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లు నియామకంపై మంగళవారం పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపు ఖాయమనే ఉద్దేశ్యంతో వారు గొడవలు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలను ఆందోళనకు గురిచేసే విధంగా వైసీపీ పన్నాగాలు పన్నుతున్నదని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లే వారు అన్ని విధాల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు పూర్తి చేయాల్సిన పత్రాలు, వాటిని ఏ విధంగా పూర్తి చేయాలో తదితర అంశాలను వివరించారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలా ఉండాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనిశెట్టి సత్యానందరెడ్డి, గుండ్ర సుబ్బారావు, మడికి ప్రసాద్, బత్తుల చైతన్యరాజేష్, అల్లవరపు నగేష్, కోళ్ల బంగారుబాబు, మలిరెడ్డి వెంకటరమణ తదితరులున్నారు.

ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలుపుదల ప్రకటనపై ఈసీ స్పందించాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

జగ్గంపేట, మే 21: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలుపుదల ప్రకటనపై ఎలక్షన్ కమిషన్ తక్షణం స్పందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. మంగళవారం జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం తెలపడం బాధాకరమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఎంతో ముఖ్యమని దాన్ని కొనసాగించడం ఎంతో అవసరమన్నారు. ఎన్నికల ఫలితాలకు ఇంకా పది రోజులు పైగా సమయం ఉండడంతో ఇటువంటి తరుణంలో నెట్‌వర్క్ ఆసుపత్రులు మానవతాదృక్పథంతో ఆలోచించి సేవలు కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 వాయిదాల్లో పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని నెహ్రూ తెలిపారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, కందుల బాబ్జి, సూతి శ్రీను, మంచి కంటి శ్రీను,పాలిశెట్టి సతీష్ తదితరులున్నారు.

ఘనంగా సదస్య మహోత్సవం



అశ్వ వాహనంపై మాఢ వీధుల్లో విహారం చేస్తున్న శ్రీరాజ్యలక్ష్మి భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మే 21: కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో గత 5రోజులుగా శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు భక్తుల నడుమ వైభవంగా సాగుతున్నాయి. కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం నూతన దంపతులను సింహాసనంపై ఆశీనులు గావించారు. వేద పండితుల ఆధ్వర్యంలో భావనారాణుడు వివాహంపై సదస్య మహోత్సవం ఘనంగా జరిపారు. వేద అధ్యయనంలోని ముఖ్య ఘట్టాలను కళ్లకు కట్టినట్లు భక్తులకు శాస్త్రోక్తంగా వివరించారు. అనంతరం నూతన వధూవరుల దంపతులను సింహాసనంపై పెట్టి అశ్వావాహనంపై మాఢ వీధుల్లో గ్రామోత్సవంలో విహరించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం శోభారాణి నేతృత్వంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన భక్తులను ఓలలాడించింది. సదస్యంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సహకారంతో ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన ఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), మే 21: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు మంగళవారం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు ఇచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

జనన మరణాలను నమోదు చేయాలి

డీఎంహెచ్‌వో నరసింహనాయక్



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), మే 21: జనన మరణాలను ప్రతీరోజు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, ఆసుపత్రుల్లో ప్రసవం తర్వాత డిశ్చార్జి రోజునే జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశించారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఆయన జనన మరణ నమోదు, ఆధునికీకరించిన అంతర్జాల పోర్టల్, ఈహెచ్ఆర్ఓపీ నమోదు, కేన్సర్ స్క్రీనింగ్‌పై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఈ పోర్టల్‌పై చట్ట సవరణ కోసం సామాన్య ప్రజలకు సైతం అర్థం అయ్యేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి జనన ధ్రువీకరణ పత్రం ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డులో భాగంగా అన్ని యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో క్రమం తప్పకుండా ఓపీలు నమోదు చేయాలన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా 30ఏళ్లు దాటిన మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహించేందుకు వీలుగా మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాలకు ట్రైనింగ్ ఇవ్వాలని ఆదేశించారు. ఇన్‌చార్జి జెడ్ఎం డాక్టర్ ఆర్.రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, డీఐవో డాక్టర్ రత్నకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత, పీవో కె.ప్రభాకర్,డాక్టర్ సురేష్ ఉన్నారు.

మాతృశిశు మరణాల నివారణే లక్ష్యం

జిల్లాలో మాతృ శిశు మరణాల నివారణే ధ్యేయంగా వైద్యులు, సిబ్బంది పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశించారు. మంగళవారం కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిల్కారి కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న సమయంలో ఇచ్చిన సెల్ నెంబర్‌కు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే సందేహాలను ఇది నివృత్తి చేస్తుందన్నారు. ఈ వాయిస్ కాల్ నాలుగో నెల నుంచి ప్రసవం వరకు పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ కిల్కారి కార్యక్రమంలో వస్తాయన్నారు. కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కోరారు. సమీక్షలో డీఐవో డాక్టర్ రత్నకుమార్, రీజినల్ ఆఫీసర్ రామ్‌మోహన్, హెచ్ఈవో జి.నరేంద్ర శేషు,డీసీఎం మణికుమారి ఉన్నారు.

భారతీయ సంస్కృతిలో జీవన విలువలు

ఆర్ఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్‌మాధవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పోర్టు సిటీ (కాకినాడ), మే 21: భారతీయ సంస్కృతిలో జీవన విలువలున్నాయని ఆర్ఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ వారణాసి రామ్‌మాధవ్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో న్యూ ఢిల్లీకి చెందిన కొచ్చర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ సంగీత వాగ్గేయ కారుడు కొచ్చర్లకోట రామరాజు 148వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సంగీత వాగ్గేయ కారుడు రామరాజు తన కళను ధన సంపాదన కోసం కాకుండా కీర్తి సంపాదించేందుకు ఉపయోగించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి వ్యక్తి ధార్మిక భావంతో ఉన్నప్పుడే కళలు విశ్వవ్యాప్త మవుతాయన్నారు. క్రీస్తుశకం 6వ శతాబ్దం వరకు ఎటువంటి కుల వివాదాలు లేవని, విదేశీయుల దండయాత్రలతో కులోన్మాదం ప్రజ్వరిల్లిందని ఈ విషయాన్ని పాశ్చాత్య దేశాలు సైతం అంగీకరిస్తున్నాయన్నారు.

సీడీ ఆవిష్కరణ

సంగీత వాగ్గేయ కారుడు రామరాజు పాడిన కీర్తనల సీడీని ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు బటన్ నొక్కి ఆవిష్కరించారు. అనంతరం ఆయన భక్తులను ప్రవచనాలు చెప్పారు. సంగీతం మనకు ప్రశాంతత ఇస్తుందన్నారు. ఉగ్రరూపంలో ఉండే దేవతలు సైతం సంగీత కళ వాయిద్యాల ద్వారా ప్రశాంత రూపంలో భక్తులను దర్శనం ఇస్తున్నారన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి గణపతి శ్లోకం పాడి సభకు స్వాగతం పలికారు. ట్రస్ట్ చైర్మన్ రామరాజు మనుమడు కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు, నార్త్ ఈస్ట్ డవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీవీఎస్ఎల్ఎన్ మూర్తి, మధురపూడి ఆశ్రమ నిర్వాహకుడు సుందర స్వామీజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొచ్చర్లకోట వంశీయులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

బీజేపీ బృందం సందర్శన

ప్రత్తిపాడు, మే 21: మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న ఉలిగోగుల గ్రామంలో గిరిజనులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నాయకుల బృందం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో 35 గిరిజన కుటుంబాలు గత కొన్ని రోజులుగా తాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలపగా రామ్‌కుమార్ కాకినాడ వెళ్లి కలెక్టర్ జె.నివాస్‌కు ఉలిగోగుల గ్రామస్థులు తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కందా వీరాస్వామి, జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, మండల మహిళా మోర్చ కార్యదర్శి ఈర్ల బేబి, మండల జనరల్ సెక్రటరీ ఇంటి వీర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'గొప్ప నేత రాజీవ్ గాంధీ'



రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, మే 21: భారత దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చి శాస్త్ర సాంకేతిక రంగాలలో అగ్రగామిగా నిలిపిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి చెక్కా నూకరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, పీసీసీ సభ్యులు కోలా ప్రసాదవర్మ, కుక్కల పోతురాజు, పోలిశెట్టి శ్రీనివాసు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, జిల్లా నాయకులు రాజారపు మహేష్, పబ్బికృష్ణ, వల్లూరి రామ్మోహనరావు, పిల్లి చిన్న పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి

ప్రత్తిపాడు, మే 21: ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు శ్రీను మాట్లాడుతూ ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కందిమళ్ల శామ్యూల్, మూరా నాగేంద్ర, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యనమలను కలిసిన అశోక్‌బాబు



యనమలను కలిసిన మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు

తుని రూరల్, మే 21: శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడిని జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తేటగుంట యనమల అతిథి గృహంలో కలిసిన వారు ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ సరళి, క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్నది కూటమి ప్రభుత్వమేనని, తునిలో కూటమి అభ్యర్థి యనమల దివ్య అఖండ మెజార్టీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన శ్రేణులు ఉన్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన



రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న జమీల్

పెద్దాపురం, మే 21: స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై చిన్నారులకు మంగళవారం అవగాహన కల్పించారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోబోటిక్స్‌పై జమీల్ అలీ విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో వివరించారు. అనంతరం పలు కళలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, మంజుల, అమృత, సాయి, బంగారం, మణికంత, నేహ, రేణుక, రవి, పవన్ పాల్గొన్నారు

వేములమ్మ, గంగాలమ్మ పండుగ

రౌతులపూడి, మే 21: మండలంలోని మూలగపూడిలో వేములమ్మతల్లి, ఎస్.అగ్రహారంలో గంగాలమ్మ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవార్లు అమ్మవార్ల జాతరను బ్యాండ్‌మేళాలు, తప్పెడుగుళ్లు, తారాజువ్వల సందడితో జరిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం

కుతుకుడుమిల్లి (కొత్తపల్లి), మే 21: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగరు, కంటి వైద్యపరీక్షలు చేసి సుమారు 40మందికి మందులు పంపిణీ చేశారు. కళ్ల పరీక్షలు కళ్లజోళ్లు అందించామని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, మే 21: మండలంలోని మల్లేపల్లి గ్రామ జాతీయరహదారి పక్కన వెలసిన అభయాంజనేస్వామి ఆలయం వద్ద మంగళవారం గ్రామానికి చెందిన భక్తులు వల్లభశెట్టి శ్రీనివాస్ (వెంకన్న), రేషన్ డీలర్ బూర్లు సాయి ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, అడిషనల్ ఎస్ఐ టేకు వెంకటేశులు, ఉమ్మడి జిల్లాల బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త చినవీరభద్రరావు(శివ), కమిటీ సభ్యులు దార్లంక శ్రీను, తెమ్మనబోయిన జయ, జాజిమొగ్గల సత్యనారాయణ, అక్కిరెడ్డి సత్తిబాబు, పిల్లా సత్యనారాయణ, వల్లభశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి గెలవాలని పూజలు

జగ్గంపేట, మే 21: టీడీపీ కూటమి ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ జ్యోతిర్లింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలోని మహాకాళేశ్వరుడు, మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, మే 21: పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం సీఐటీయూ నాయకులు ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం బాటసారులకు మజ్జిగ వితరణ చేశారు.

